

ప్రదీప్‌చౌదరికి మెమెంటోను అందిస్తున్న బక్కిని నర్సింహులు, అరవింద్‌కుమార్ గౌడ్ తదితరులు

పార్టీ కోసం పనిచేసే వారికే గుర్తింపు

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కిని నర్సింహులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కిని నర్సింహులు అన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదులో భాగంగా నగరంలో అత్యధిక సభ్యత్వాలు చేసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం నాయకుడు వి.ప్రదీప్‌చౌదరిని ఎన్‌టీఆర్ ట్రస్టు భవన్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీడీపీ బలోపేతమవుతుందని చెప్పడానికి సభ్యత్వ నమోదు ఓ ఉదాహరణ అన్నారు. అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సభ్యత్వాన్ని స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్‌గౌడ్, టీటీడీ బోర్డు సభ్యుడు నల్లూరి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలంలో నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాక్ గార్డెన్ కోసం ఏర్పాటు చేసిన స్థలంలో ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ నిర్మించారని, దీన్ని వెంటనే కూల్చి వేయాలని కోరుతూ హైడ్రాకు జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు కాటూరి రమేష్ ఫిర్యాదు చేశారు. ఫిలింనగర్ లేఅవుట్‌లో పార్కు స్థలమని సూచించగా ఎఫ్‌ఎన్‌సీసీ నిర్వాహకులు అందులో నిర్మాణాలు చేసి వ్యాపార కేంద్రంగా మార్చారన్నారు. ఈ నిర్మాణాలను కూల్చివేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలని కోరారు.



వినాయక విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న గుత్తా సుఖేందర్ రెడ్డి

నిర్మాణాలు పర్యావరణ అనుకూలంగా ఉండాలి

● శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

పంజాగుట్ట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ అనుకూలంగా నిర్మాణాలు జరగాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రణవ గ్రూప్ ఆధ్వర్యంలో ఎర్రమంజిల్‌లో నిర్మించనున్న ప్రణవ వన్ హైదరాబాద్ ఫేజ్-2కు ఆయన సంస్థ ఛైర్మన్ రవికుమార్ గుప్తాతో కలిసి భూమిపూజ చేశారు. వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన, క్లబ్ హౌస్ ప్రారంభంలో ఆయన పాల్గొన్నారు. ఎకరం విస్తీర్ణంలో 95 సూపర్ లగ్జరీ నివాసాలు నిర్మిస్తున్నామని రవికుమార్ తెలిపారు. అమెరికా, యూరప్ దేశాల్లోని అత్యుత్తమ జీవనశైలికి అనుగుణంగా అద్భుతమైన సౌకర్యాలతో నిర్మాణం ఉంటుందన్నారు. సోమాజిగూడలో నిర్మించిన ప్రణవ వన్ హైదరాబాద్ ఫేజ్-1కు మంచి స్పందన వచ్చిందని, పక్కనే ఎకరం విస్తీర్ణంలో ఫేజ్-2కు భూమి పూజ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రణవ గ్రూప్ ఎండీ బి.రవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి

ముగ్గురు క్రికెట్ బెట్టింగ్ ముఠా సభ్యుల అరెస్ట్

● పరారీలో మరో 10 మంది

● రూ. 4.73 లక్షల నగదు, 15 సెల్ ఫోన్లు, 7 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

అమీర్‌పేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠా సభ్యులను ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూ.4.73 లక్షల నగదు, 7 ల్యాప్‌టాప్‌లు, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా, రామగుండం మండలం ఎల్కలపల్లి గ్రామానికి చెందిన లింగాల అరుణ్ రాజ్, ఇదే గ్రామానికి చెందిన లింగాల సాకేత్, మేకల సంజయ్ తైవాన్ దేశానికి చెందిన గ్రిగోరీతో పరిచయం పెంచుకున్నారు. వారు జయప్రకాష్‌నగర్‌లో ఉంటూ గుగో బెట్ ఇండియా యాప్ ద్వారా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. అరుణ్‌రాజ్ క్రికెట్ 360 మీడియా పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పేజీని సృష్టించాడు. అనంతరం గుగోబెట్ ఇండియా ప్రచార వీడియో ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్‌లోకి ప్రవేశించాడు. బెట్టింగ్ లావాదేవిలను నియంత్రించే గ్రిగోరీ ప్రధాన బుకి కార్యకలాపాలలో చేరాడు. అరుణ్‌రాజ్ తన సోదరుడు సాకేత్, స్నేహితుడు సంజయ్ సహాయంతో బెట్టింగ్ ఖాతాలకు సంబంధించిన డిపాజిట్లు, ఉపసంహరణలను నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, గ్రిగోరీ, చిట్టిమల్ల అక్షయ్, రావుల రవితేజ, ఎండీ ముజామిల్ అమన్, కొత్వాల్ సందీప్ కుమార్, బేగరి సతీష్, తల్లా అక్షయ్, పంజాలాలా భాను తేజ, మండల రాజ్‌కుమార్, మట్టసాయి కృష్ణ పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి వెల్లడించారు, ఈ సమావేశంలో డీఐ గోపాల్, ఎస్ఐలు శ్రావణ్ కుమార్, రాజురాథోడ్ పాల్గొన్నారు.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న నటి ప్రియాంక అరుల్ మోహన్

గ్జీతివీవ్స్‌లో ఆకట్టుకుంటున్న పట్టు చీరల ప్రదర్శన

బంజారాహిల్స్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 45 గ్జీతివీవ్స్‌లో 'ప్రతి కారణానికి చీర, ప్రతి సీజన్‌కి చీర' గ్రాండ్ పట్టు చీర కలెక్షన్స్‌ను నటి ప్రియాంక అరుల్ మోహన్ తో కలిసి గ్జీతి మేనేజింగ్ డైరెక్టర్లు సౌజన్య, బాబీ తిక్క, టి.శ్రీనివాస్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నటి ప్రియాంక మాట్లాడుతూ.. చీరలు భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని, సాంప్రదాయం, గాంభీర్యాన్ని సూచిస్తాయన్నారు. ఈ కలెక్షన్స్ చేనేత కార్మికుల ప్రతిభకు అద్దం పడుతున్నాయన్నారు. నిర్వాహకురాలు సౌజన్య మాట్లాడుతూ.. గ్జీతివీవ్స్‌ను రెండు సంవత్సరాల క్రితం స్థాపించామని, అప్పటి నుంచి దేశీయ హస్తకళ, సంస్కృతి, సాంప్రదాయ డిజైన్‌లను కాపాడేందుకు ప్రత్యేక కలెక్షన్‌లను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. పండుగ, పెళ్లిళ్ల సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా చేనేత కార్మికులతో కొత్త కలెక్షన్స్ రూపొందించి ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

సర్కార్ దవాఖానాలో సమస్యల పాగా

● మూలనపడిన అంబులెన్స్
● 9 నెలలుగా సిబ్బందికి అందని జీతాలు
● ఇబ్బందులు పడుతున్న రోగులు, సిబ్బంది

బోరబండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రోజూ వందల మంది రోగులతో కిటకిటలాగే శ్రీరాంనగర్ ప్రభుత్వ వైద్యశాలలో సౌకర్యాల లేమితో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల తాకిడిని చూసిన స్థానిక ఎమ్మెల్యే గతంలో అంబులెన్స్‌ను విరాళంగా ఇచ్చారు. అయితే మూడు నెలల నుంచి అంబులెన్స్ రిపేర్‌కు వచ్చి మెకానిక్ షెడ్‌కు చేరింది. దీంతో రోగులు, రోగి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు సెక్యూరిటీ సమస్య ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిని వేధిస్తోంది. మరోవైపు ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 9 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు.

గర్భిణులకు మెరుగైన వైద్యం

శ్రీరాంనగర్ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో గర్భిణులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఇక్కడ 95 శాతం వరకు సాధారణ కాన్పులే చేస్తున్నారు. ఒకవేళ సిజేరియన్ చేయాల్సి వస్తే అనుభవజ్ఞులైన వైద్య అధికారుల సలహాలు తీసుకుని అమీర్‌పేట ప్రధాన ఆసుపత్రికి, జిల్లా ప్రధాన అసుపత్రికి గర్భిణులను తరలిస్తారు. ఈ ఆసుపత్రికి నెలకు 60 మందికి పైగా గర్భిణులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటారు.

అంబులెన్స్ రిపేరుకు రూ.30 వేల ఖర్చు

ఎమ్మెల్యే విరాళంగా ఇచ్చిన అంబులెన్స్ ప్రస్తుతం మెకానిక్ షెడ్‌లో ఉంది. రిపేర్ చెయించడానికి రూ.30 వేల ఖర్చవుతుందని మెకానిక్ వెల్లడించాడు. ఈ క్రమంలో దాతలు ముందుకొచ్చి అంబులెన్స్‌ను రిపేర్ చేయించాలని రోగులు కోరుతున్నారు. ఓ కానిస్టేబుల్, హోంగార్డును కేటాయించి సెక్యూరిటీ సమస్యను పరిష్కరించాలని ఆస్పత్రి సిబ్బంది కోరుతున్నారు.



శ్రీరాంనగర్ ప్రభుత్వ వైద్యశాల

యూనిఫాం ఇవ్వడం లేదు



కమల ఏజెన్సీ తరపున శ్రీరాంనగర్ ఆసుపత్రిలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నా. రెండేళ్లుగా యూనిఫాం, ఐడీ కార్డు, బెల్ట్ ఇవ్వడం లేదు. తొమ్మిది నెలలుగా జీతాలు సైతం ఇవ్వడం లేదు. అధికారులు చొరవ తీసుకుని జీతం వచ్చేలా చూడాలి.

\- ఎండీ జాఫర్, సెక్యూరిటీ

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా



ఓపీ విభాగంలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నా. గత తొమ్మిది నెలలుగా జీతం ఇవ్వడం లేదు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. మరోవైపు గత 18 నెలలుగా పీఎఫ్ జమ చేయడం లేదు.

\- శ్రీకాంత్, ఓపీ సిబ్బంది



ఏజీ కాలనీ చౌరస్తాలో చలివేంద్రాన్ని ప్రారంభించిన బోరబండ సీఐ శేఖర్

స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని బోరబండ సీఐ శేఖర్ కోరారు. మంగళవారం ఏజీ కాలనీ చౌరస్తాలో అల్ మదీనా సొసైటీ అధ్యక్షుడు మొహమ్మద్ సలీం జావేద్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సలీం జావేద్ మాట్లాడుతూ.. గత 17 సంవత్సరాలుగా సొసైటీ ఆధ్వర్యంలో ఏజీ కాలనీ చౌరస్తాలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతాజీ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్ నయీమ్, సొసైటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాదిగలకు 11శాతం రిజర్వేషన్లు కల్పించాలి

● మాదిగ హక్కుల దండోరా అధ్యక్షుడు సురేష్‌మాదిగ

పంజాగుట్ట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వెనుకబాటుతనం, జనాభా దామాషా ప్రకారం మాదిగ సామాజిక వర్గానికి 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, నగరంలో మాదిగ అమరవీరుల స్మారక భవనానికి స్థలం కేటాయించి భవన నిర్మాణం చేపట్టాలని మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) జాతీయ అధ్యక్షుడు దండు సురేష్‌మాదిగ డిమాండ్ చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో దండోరా రాష్ట్ర మహాసభలను నాగార్జునసాగర్‌లోని హోటల్ హరిత విజయ్ విహార్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ, కార్యనిర్వాహక అధ్యక్షుడు చింతల శ్యామ్ మాదిగ, బొర్ర శాంతికుమార్ మాదిగలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. వర్గీకరణలో తమకు కొంత నష్టం జరిగిందని, పూర్తిస్థాయి చట్టం చేసేలోగా జరిగిన నష్టాన్ని పూరించాలని కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సురేష్‌మాదిగ, శంకర్‌మాదిగ తదితరులు

మార్చి 11న ట్యాంక్‌బండ్‌పై రెడ్డి మార్చ్

● రెడ్డి జాగృతి వ్యవస్థాపకుడు మాధవరెడ్డి
● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ నుంచి బహిష్కరించాలని డిమాండ్

పంజాగుట్ట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని రెడ్డి జాగృతి సంస్థ డిమాండ్ చేసింది. ఆయన వ్యాఖ్యలకు నిరసనగా మార్చి 11న వేలాదిమందితో ట్యాంక్ బండ్‌పై రెడ్డి మార్చ్ నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డి ప్రకటించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్ రెడ్డి, ఇతర నాయకులతో కలిసి రెడ్డి మార్చ్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో కొనసాగుతూ ఓ సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో బహిరంగ క్షమాపణ చెప్పించాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఆయన్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోకుంటే మార్చి 11న చలో హైదరాబాద్, ట్యాంక్ బండ్‌పై రెడ్డి మార్చ్ నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంస్థ నాయకులు మేక సోమిరెడ్డి, మొగుళ్ల నరేందర్ రెడ్డి, నర్సిరెడ్డి, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.



రెడ్డి మార్చ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్డి జాగృతి నాయకులు

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తుల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో చోరీ జరిగిన కేసులో మాసబ్ ట్యాంక్ పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాసి వంశీ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన వ్యక్తితో కలిసి జూబ్లీహిల్స్‌లోని రెడ్‌యాంట్స్‌లో 6 నెలల పాటు పనిచేశారు. ఫొటోగ్రాఫర్ అయిన వంశీకి ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. పథకంలో భాగంగా తనతో కలిసి పనిచేసే వ్యక్తికి సంబంధించిన విలువైన కెమెరాలను, లెన్స్‌లను మరో ఇద్దరు స్నేహితులతో కలిసి జనవరి 31న దొంగిలించారు. వాటిని ఓఎల్‌ఎక్స్‌లో రూ. 2.11 లక్షలకు విక్రయించారు. ఈ కేసులో వంశీతో పాటు ముజమిల్ ఫరాజ్, ఎం.సతీష్, రాణిత్ మల్లిక్, పరీక్షిత్ దాస్, జోడిగడ్ల రఘు బాబు, ఆకాష్ సింగ్‌లను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మరో కేసులో ముగ్గురు..

వాహనాలను చోరీ చేస్తున్న ముఠాను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన పోతులూరి చంద్రశేఖర్(39), ఇంద్రానగర్‌కు చెందిన కాలింది సూరిబాబు(35), జూబ్లీహిల్స్‌కు చెందిన దండంగి ప్రసాద్ (32) వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఈ నెల 10న ఎల్ వెంకట సతీష్ తన బ్లూ హోండా యాక్టివాను యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లోని నివాసం వద్ద పార్కింగ్ చేయగా కనిపించకుండా పోయింది. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు నిందితులు కలిసి సిండికేట్‌గా ఏర్పడి మోటారు వాహనాలను దొంగిలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వారి నుంచి మూడు యాక్టివా వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై గతంలోనూ పలు కేసులు నమోదయ్యాయని, నంబర్ ప్లేట్‌లను మార్చి వాహనాలను విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితులను మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చినట్లు పోలీసులు తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసుల కస్టడీ పిటిషన్

పంజాగుట్ట ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో లోతుగా దర్యాప్తు చేసేందుకు జైలులో ఉన్న నిందితులను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పంజాగుట్ట పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై అక్రమంగా నిఘా పెట్టి ఫోన్ ట్యాపింగ్ చేశారని, కుట్రపూరితంగా వ్యవహరించారని సిద్దిపేటకు చెందిన చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పంజాగుట్ట పోలీసులు సంతోష్‌కుమార్, బండి పరశురాములు, టి.వంశీకృష్ణలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచిన సంగతి విదితమే. కేసు దర్యాప్తులో భాగంగా వారిని కస్టడీకి తీసుకొని విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. నిందితులను కస్టడీకి తీసుకొని విచారించడం ద్వారా కేసులకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.



ఇటలీ బృందంతో నిమ్స్ వైద్యులు, సిబ్బంది

నిమ్స్‌ను సందర్శించిన ఇటలీ బృందం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ను మంగళవారం ఇటలీలోని సన్ విశ్వవిద్యాలయం డాక్టర్ అల్లెసాండ్రో డెల్లా కోర్టే బృందం సందర్శించారు. నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్పను ఇటలీ బృందం కలిసింది. ఆస్పత్రి వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను కలిసి మాట్లాడారు. వైద్య సేవల గురించి ఆస్పత్రి కార్డియో తెరాసిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ అంబరీష్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీవీటీఎస్, అనస్థీషియా విభాగం సిబ్బందితో చర్చలు జరిపారు. గాంధీ ఆస్పత్రి సీవీటీఎస్ విభాగం అధిపతి డా. రవీంద్ర, ఉస్మానియా సీవీటీఎస్ విభాగం అధిపతి డాక్టర్ అనిత భల్లా, ఈఎస్ఐ సీవీటీఎస్ విభాగాధిపతి డా. అభిజీత్, నిమ్స్ ప్రొఫెసర్ డా.అర్చన, వైద్యులు గోపాల్, రామకృష్ణ, కళాధర్ పాల్గొన్నారు.



బీమా బాండ్లను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ సైదులు

ట్రాఫిక్ పోలీసులకు బీమా బాండ్లు అందజేత

అమీర్‌పేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ విభాగం అధికారి శ్రీనివాసరావు సలహా మేరకు ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి తపాలా బీమా బాండ్లను అందజేసినట్లు ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. హోం గార్డులు, సీపీఎస్ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్ సదుపాయం లేని కారణంగా బీమా బాండ్లను అందజేశామన్నారు.

హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యం



దివ్యభార్గవి

బోరబండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ నుంచి చెప్పకుండా బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు బొల్లినేనివారిపాలెంకు చెందిన దండు శ్రీనివాసరావు కుమార్తె దివ్య భార్గవి (23) ఎర్రగడ్డ శాంతినికేతన్ మహిళా కళాశాలలో ఎంకాం మెదటి సంవత్సరం చదువుతోంది. సమీపంలోని హాస్టల్‌లో ఉంటుంది. సోమవారం సాయంత్రం బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో హాస్టల్ నిర్వాహకుడు జంగం చంద్రశేఖర్ దివ్యభార్గవి తండ్రి శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆరా తీయగా ఊరికి వెళ్తున్నట్లు స్నేహితులకు చెప్పినట్లు తెలిసింది. తండ్రి శ్రీనివాసరావు, హాస్టల్ నిర్వాహకుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమాదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్పీఆర్‌హిల్స్‌లో గృహిణి..



దివ్యభారతి

బోరబండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి మార్కెట్‌కి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీఆర్‌హిల్స్ వినాయకనగర్‌కు చెందిన తిర్లంగి దివ్యభారతి (24) సోమవారం రాత్రి 8 గంటల సమయంలో మార్కెట్‌కి వెళ్లింది. పెయింటింగ్ పనికి వెళ్లిన భర్త ఇంటికి వచ్చి చూడగా తాళం వేసి ఉంది. భార్యకి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆమె భర్త కృష్ణారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎర్రమంజిల్‌లో మరొకరు..

పంజాగుట్ట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వికారాబాద్ పరిగికి చెందిన చాకలి లక్ష్మయ్య, కవితలు భార్యాభర్తలు. వీరు ఎర్రమంజిల్ కాలనీలో ఉంటున్నారు. లక్ష్మయ్య వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా, కవిత ఇళ్లలో పనిచేస్తోంది. ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లిన కవిత తిరిగి రాలేదు. లక్ష్మయ్య ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రక్షణ శాఖ భూములను ప్రభుత్వం పేరిట బదలాయించుకొని, అందులో పేదలకు ఇళ్లు కట్టించాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రేవంత్‌రెడ్డిని కలిసి ఆయన వినతి పత్రం సమర్పించారు. కంటోన్మెంట్‌లోని పలు బస్తీల్లో నిరుపేదలు చాలా ఏళ్లుగా జీవిస్తున్నారన్నారు. ఆ స్థలాలు తమవంటూ రక్షణ శాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. 10 వేల మంది పేదలు నిత్యం టెన్షన్‌తో జీవిస్తున్నారన్నారు. ఈ విషయమై సీఎం సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడుతానని అన్నారన్నారు.

అక్రమ ఇసుక డంప్‌లపై దాడులు

350 టన్నులను గుర్తించిన టాస్క్‌ఫోర్స్



నిర్వాహకులను విచారిస్తున్న అధికారులు

బోయినపల్లి, తిరుమలగిరి ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి మండల పరిధిలోని బోయినపల్లి బాలంరాయ్ వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులపై ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్, తిరుమలగిరి మండల రెవెన్యూ అధికారులు మంగళవారం దాడులు చేశారు. ఆ మేరకు 350 టన్నుల ఇసుకను గుర్తించారు. సరైన పత్రాలు లేకుండానే డంపులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కంటోన్మెంట్, రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు ఎందుకు తీసుకోలేదని తిరుమలగిరి మండల తహసీల్దార్ అశోక్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా నిల్వ ఉంచి విక్రయాలు చేపడుతున్నారని తేలితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం : సీఐ



సదస్సులో విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నాగరాజు

తిరుమలగిరి ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు జీవితాలను చిత్తు చేస్తాయని తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. గ్రామం సమీపంలోని ఆకాష్ ఇనిస్టిట్యూట్‌లో విద్యార్థులకు మత్తు పదార్థాలు, సైబర్ నేరాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు లాంటివి జీవితాలను నాశనం చేస్తాయన్నారు. వాటికి దూరంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాలలు, పాఠశాలల వద్ద కొందరు ఆగంతకులు మత్తుమందు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. వాటికి దూరంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. డిజిటల్ అరెస్టు, డ్రగ్స్ వాడకం, భవిష్యత్‌లో వాటివల్ల జరిగే నష్టాలు, మహిళలు, పిల్లల చట్టాల గురించి తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఆంతోనియమ్మ ఉన్నారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ముఠాగా ఏర్పడి చోరీ చేస్తున్న ముగ్గురిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన పోతులూరి చంద్రశేఖర్(39), ఇంద్రానగర్‌కు చెందిన కాలింది సూరిబాబు(35), జూబ్లీహిల్స్‌కు చెందిన దండంగి ప్రసాద్ (32) వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఈనెల 10న ఎల్.వెంకట సతీష్ హోండా యాక్టివాను యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లోని తన నివాసం వద్ద పార్కింగ్ చేయగా కనిపించకుండా పోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ముగ్గురు నిందితులు కలిసి ముఠాగా ఏర్పడి బైక్‌లను దొంగిలిస్తున్నట్లు విచారణలో తేలింది. వారిని అదుపు తీసుకున్నారు. మూడు యాక్టివా వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై గతంలోనూ పలు కేసులు నమోదయ్యాయని, నంబర్ ప్లేట్‌లను మార్చి వాహనాలను విక్రయిస్తున్నట్లు విచారణలో గుర్తించారు. నిందితులను మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చినట్లు పోలీసులు తెలిపారు.

ఇంట్లో చోరీ కేసులో ఏడుగురు ..

ఇంట్లో చోరీ చేసిన కేసులో ఏడుగురిని మాసబ్ ట్యాంక్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాసి వంశీ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన వ్యక్తితో కలిసి జూబ్లీహిల్స్‌లోని రెడ్‌యాంట్స్‌లో 6 నెలల పాటు పనిచేశాడు. ఫొటోగ్రాఫర్ అయిన వంశీకి ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. పథకంలో భాగంగా తనతో కలిసి పనిచేసే వ్యక్తికి సంబంధించిన విలువైన కెమెరాలను, లెన్స్‌లను మరో ఇద్దరు స్నేహితులతో కలిసి జనవరి 31న దొంగిలించారు. వాటిని రూ. 2.11 లక్షలకు విక్రయించారు. ఈ కేసులో వంశీతో పాటు ముజమిల్ ఫరాజ్, ఎం.సతీష్, రాణిత్ మల్లిక్, పరీక్షిత్ దాస్, జోడిగడ్ల రఘు బాబు, ఆకాష్ సింగ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కులగణనను సద్వినియోగం చేసుకోవాలి

● బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ నిరంజన్

గోల్నాక/నల్లకుంట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కులగణనను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేను పూర్తిస్థాయి నిర్వహించి, క్షేత్రస్థాయిలో వివరాలను పొందుపరచాలని అధికారులకు సూచించారు. బీసీ కమిషన్ చేపట్టిన కులగణనలో భాగంగా మూడో రోజు మంగళవారం గోల్నాక డివిజన్‌లోని నెహ్రూనగర్‌లో నిరంజన్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు కులగణన జరిగిన తీరుపై ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. కులగణన సర్వేకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని నిరంజన్ తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ బీజేపీ కుటిల రాజకీయం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజీవ్‌గాంధీ, రాహుల్ గాంధీలపై బీజేపీ నాయకులు విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు హఫీసర్ నవాబ్, పోలే రామ్మోహన్‌రావు, లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు రామారావు, రావుల సుధాకర్, జమీర్, ఆర్.నరేష్‌యాదవ్, తొలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూనగర్‌లో వివరాలు తెలుసుకుంటున్న బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ నిరంజన్, వి.హనుమంతరావు

నామినేటెడ్ సభ్యుడికి పదవీ గండం?

● బాణుక నర్మదకు అవకాశం ఇవ్వాలని ఎంపీ ఈటల సిఫారసు

● ఈ పోస్టుపై నెలకొన్న ఉత్కంఠ

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఓ నామినేటెడ్ సభ్యుడి.. పదవికి గండం పొంచి ఉంది. ఆ స్థానంలో మరోకరికి అవకాశం కల్పించాలని మల్కాజిగిరి ఎంపీ రక్షణ శాఖకు సిఫారసు చేయడంతో స్థానికంగా ఉత్కంఠ నెలకొంది. కంటోన్మెంట్ల నామినేటెడ్ సభ్యుల పదవీ కాలం గడువు ముగిసినా మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ రక్షణ శాఖ ఇటీవల గెజిట్ విడుదల చేయడం విదితమే.

సికింద్రాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ పార్టీకే చెందిన నర్మదను కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలిగా నియమించాలని కొద్ది రోజులుగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి సహా ఉన్నతాధికారులను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సంప్రదిస్తున్నారు. సాధారణంగా నామినేటెడ్ సభ్యుడి ఎంపిక విషయంలో ఎంపీ సిఫారసుకే ఆశాఖ ప్రాధాన్యతనిస్తుంది. ప్రస్తుతం ఈ విషయమై ఇటు రాజకీయ వర్గాల్లో, అటు సాధారణ ప్రజానీకంలో చర్చనీయాంశంగా మారింది.



బాణుక నర్మద

రెండు సార్లు పొడిగింపు

ఇతర కంటోన్మెంట్లతోపాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు చివరిసారిగా 2015 జనవరిలో ఎన్నికలు జరిగాయి. మొత్తం 8 వార్డుల నుంచి విజయం సాధించిన సభ్యులు మార్చిలో ప్రమాణం చేశారు. అనంతరం తమలో ఒకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఐదేళ్ల వారి పదవీ కాలం 2020 జనవరిలో ముగిసింది. కాని సభ్యుల పదవీ కాలాన్ని ఆరు నెలల చొప్పున రెండు సార్లు పొడిగించారు. దీంతో 2021లో పదవీ కాలం పూర్తయింది. ఆ వెంటనే కూడా ఎన్నికలు జరపకుండా, 2021 నవంబర్‌లో సివిల్ నామినేటెడ్ మెంబర్‌ను ఆశాఖ నియమించింది.

రామకృష్ణకు కిషన్‌రెడ్డి ఆశీస్సులు..

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అండదండలతోపాటు ఇతర బీజేపీ పెద్దల ఆశీస్సులతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రామకృష్ణ నామినేటెడ్ సభ్యుడిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి ప్రతీ ఆరునెలలకోసారి నామినేటెడ్ సభ్యుడి పదవీ కాలం పొడిగిస్తూ వచ్చారు. ఇటీవల మరో ఆరు నెలల పాటు నామినేటెడ్ సభ్యుల పదవీ కాలాన్ని పొడిగిస్తూ గెజిట్ కూడా విడుదలైంది.



రామకృష్ణ ఇదే పదవీలో కొనసాగుతారు. కానీ ఎంపీ రంగంలోకి దిగి నర్మద పేరు సిఫారసు చేస్తూ లేఖ రాస్తే రక్షణ శాఖ నుంచి సానుకూల స్పందన వచ్చింది. దీంతో వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసి నివేదిక పంపాలని కంటోన్మెంట్ బోర్డుకు సమాచారం ఇచ్చింది. ఈ ప్రక్రియను కూడా పూర్తయ్యిందని తెలిసింది. మరోవైపు తన పదవీని కాపాడుకునేందుకు రామకృష్ణ యత్నాలు కొనసాగిస్తున్నట్టు తెలిసింది.



తహసీల్దార్‌ను శాలువాతో సన్మానిస్తున్న బస్తీ నాయకులు

పట్టాదారులకు పొజిషన్ చూపండి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్ నిలయం వెనుక ఉన్న అంబేద్కర్‌నగర్ బస్తీలో కొన్నేళ్ల నుంచి నివాసం ఉంటున్న అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు ఉన్నాయని కానీ పొజిషన్‌లు చూపించాలని బస్తీవాసులు అన్నారు. ఆ మేరకు సర్టిఫికెట్లు కూడా ఇవ్వాలని కోరారు. మంగళవారం మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కొన్నేళ్ల క్రితం నుంచి నివాసం ఉంటున్న లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్‌లు ఇవ్వలేదన్నారు. బస్తీలో సర్వే నిర్వహించాలన్నారు. తొలుత తహసీల్దార్‌కు శాలువా కప్పి సన్మానించారు. ఎమ్మార్వోను కలిసిన వారిలో రైతు రాజయ్య, చిన్నవీరయ్య, బాల్ నర్సింహ, పాషా, ప్రభాకర్, నర్సింహ ఉన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలో వైద్యసేవలు అందించే ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు నిబంధనలు పాటించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ హరిహరకళాభవన్‌లో ప్రైవేటు ఆస్పత్రులు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఫిజియోథెరపీ, ఆయుష్ క్లినిక్‌ల మెడికల్ డైరెక్టర్లు, మేనేజ్‌మెంట్ ప్రతినిధులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయరాదన్నారు. అర్హత కలిగిన సిబ్బందిని మాత్రమే నియమించుకోవాలన్నారు. యేటా సర్వీసు రేట్లు అందించాలన్నారు. ప్రతీఒక్కరు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు, యాక్ట్, పీసీ పీఎన్‌డీటీ యాక్ట్, ఎంటీపీ యాక్ట్, సరోగసీ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నిబంధనలు పాటించని వాటిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా వైద్యరంగంలోని పలుచట్టాల వివరాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు జగన్ మోహన్‌రెడ్డి, డాక్టర్ మినహాజ్ నస్రబాది, తానా అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ సురేష్ గౌడ్, డాక్టర్ నౌనిహాల్‌సింగ్, డాక్టర్ మంజులరావు, నిరంజన్‌రెడ్డి, డాక్టర్ సాయికాంత్, తుకారం రాథోడ్, రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు సన్నద్ధం



మూల విరాట్టు



దేవాలయం

తిరుమలగిరి ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలకు బొల్లారం డౌటన్ బజార్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం (శివాలయం) సన్నద్ధమవుతోంది. ఈనెల 24వ తేదీ సోమవారం సాయంత్రం 7 గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ తెలిపింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. 25న సాయంత్రం శివపార్వతుల పల్లకీసేవ, 26న మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆరోజు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పూజలు, అభిషేకాలు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు అఖండ అభిషేకం నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. అదే రోజున రాత్రి 12 గంటలకు లింగోద్భవ మహా అభిషేకం జరుగుతోందని చెప్పింది.

పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి

రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం మహా శివరాత్రి వేడుకలకు సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతం పెయింటింగ్ పనులు కొనసాగుతున్నాయి. యేటా లాగే ఈ ఏడాది కూడా విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులు రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నాం.

- పవన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు

కొనసాగుతున్న మహా సత్రయాగం



మహా సత్రయాగంలో భక్తులు

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మహా సత్రయాగం 19వ రోజైన మంగళవారం కూడా కొనసాగింది. సికింద్రాబాద్ ఆవుల మందలో కన్యకాపరమేశ్వరీ దేవస్థాన ఆలయ పునర్నిర్మాణం పూర్తి కావస్తున్న సందర్భంగా 102 ఆర్య వైశ్య రుషి గోత్రికులతో 102 రోజులపాటు దీన్ని నిర్వహించనున్నారు. అఖిల విశ్వ గాయత్రి పరివార్ శాంతిపుంజ్, హరిద్వార్ హైదరాబాద్ కన్వీనర్ మోటూరి వెంకటేశ్వర గుప్తా నేతృత్వంలో యాగం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయం ప్రాంగణంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సోమ ఆనంద్ మాట్లాడుతూ 200 సంవత్సరాల చరిత్ర కలిగిన అమ్మవారి దేవాలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం రూ.8 కోట్ల నిధులతో చేపట్టామన్నారు. మరో ఆరు మాసాల్లో పనులు పూర్తవుతాయన్నారు. ఆలయ కమిటీ కార్యదర్శి తమ్మి వెంకటేష్ మాట్లాడుతూ మే 12 పౌర్ణమి నాడు పూర్ణాహుతితో ఈ మహా సత్రయాగం ముగుస్తోందన్నారు.

బీమా బాండ్ల అందజేత



ట్రాఫిక్ పోలీసులకు బాండ్లు అందజేస్తున్న సైదులు

అమీర్‌పేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బందికి తపాలా బీమా బాండ్లను అందజేసినట్లు ఎస్ ఆర్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోం గార్డులు, సీపీఎస్ ఉద్యోగులకు భవిష్యత్ ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్ సదుపాయం ఉండదన్నారు. దీంతో చిన్న మొత్తాలను పొదుపు చేయడం మంచిదని, ఇది భవిష్యత్ ప్రయోజనాలకు ఉపయోగపడుతుందని అవగాహన కల్పించామన్నారు. ఆ మేరకు బీమా బాండ్లను అందజేశామన్నారు. ఈ సదుపాయం వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుని సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ పాలసీలు తీసుకుంటున్నారని అన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

● ముగ్గురు క్రికెట్ బుకీల అరెస్టు

● పరారీలో 10 మంది : ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి

అమీర్‌పేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠా సభ్యులను ఎస్‌ఆర్ నగర్ పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద రూ, 4,73,508 లక్షల నగదు, 7 ల్యాప్‌టాప్‌లు, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి వెల్లడించారు.

పెద్దపల్లి జిల్లా, రామగుండం మండలం ఎల్కలపల్లికి చెందిన లింగాల అరుణ్ రాజ్, ఇదే గ్రామానికి చెందిన లింగాల సాకేత్, మేకల సంజయ్‌లు తైవాన్ దేశానికి చెందిన గ్రెగొరీతో పరిచయం ఏర్పడింది. జయప్రకాష్ నగర్‌లో ఉంటూ గుగో బెట్ ఇండియా యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. పోలీస్ విచారణలో అరుణ్ రాజ్.. క్రికెట్ కంటెంట్‌ను తెలుసుకోవడానికి క్రికెట్ 360 మీడియా పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పేజీని సృష్టించినట్లు ఒప్పుకున్నాడు. అనంతరం ఈ యాప్ ప్రచార వీడియో ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్‌లోకి ప్రవేశించాడు. అతను ఒక ప్రైవేట్ అప్లికేషన్ ద్వారా లావాదేవీలను నియంత్రించే ప్రధాన బుకీ గ్రెగొరీకి చెందిన కార్యకలాపాలను నిర్వహిస్తాడు. అరుణ్ తన సోదరుడు సాకేత్, స్నేహితుడు సంజయ్ సహాయంతో బెట్టింగ్ ఖాతాలకు సంబంధించిన డిపాజిట్లు, వాటి ఉపసంహరణలు చేస్తుంటాడు. ఖాతాదారుల అనుమతి లేకుండా పొందిన నకిలీ సిమ్ కార్డులను ఉపయోగించి టీఎంటీ నెట్ బ్యాంకింగ్ ద్వారా లావాదేవీలను కొనసాగిస్తున్నాడు. ఆ మేరకు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తైవాన్ దేశానికి చెందిన ప్రధాన బుకీ గ్రెగొరీ, చిట్టిమల్ల అక్షయ్, రావుల రవితేజ, ఎండీ ముజామిల్ అమన్, కొత్వాల్ సందీప్ కుమార్, బేగరి సతీష్, తల్లా అక్షయ్, పంజాలాలా భాను తేజ, మండల రాజ్ కుమార్, మట్టసాయి కృష్ణలు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. డీఐ గోపాల్, ఎస్ఐలు శావణ్ కుమార్, రాజు రాథోడ్, అఖిల, సిబ్బంది పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న వైద్యబృందం

విద్యార్థులు కంటి పరీక్షలు చేయించుకోవాలి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పాఠశాల విద్యార్థులు కంటి పరీక్షలు చేసుకోవాలని డిప్యూటీ డీహెచ్‌ఎంఓ డాక్టర్ జయశ్రీ సూచించారు. మంగళవారం అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈనెల 17 నుంచి మార్చి 6 వరకు ప్రతీ పాఠశాల నుంచి విద్యార్థులు ఆస్పత్రికి వచ్చి వైద్య, కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి కంటి అద్దాలను ఉచితంగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం వైద్యులు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కాసర్ల వీరు ఎస్ఎం మీనాక్షిలతో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు గోపాలపురం ప్రకాష్



కార్యవర్గసభ్యులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఉచిత వైద్య శిబిరాలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు గోపాలపురం ప్రకాష్ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ సోమసుందరం వీధిలో ఉన్న విశ్వకర్మ సంఘ భవనంలో అపోలో ఫార్మసీ వారి సహకారంతో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మారుతున్న నేటి ఆహార అలవాట్లను దృష్టిలో పెట్టుకుని ప్రతీ మనిషి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ శిబిరంలో అన్ని పరీక్షలు నిర్వహిస్తారని, బీపీ, మధుమేహానికి మాత్రం మందులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి గిర్మాపురం భాస్కరాచారి, ఉపాధ్యక్షుడు కటకం చక్రపాణి, కార్యవర్గ సభ్యులు నరేష్, స్వామి, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మా పేరిట మీటర్లు మార్చండి



ఏడీకి వినతి పత్రం అందజేస్తున్న ఆంజనేయులు తదితరులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): 'అమ్మ పేరుతో ఉన్న విద్యుత్ మీటర్లు మా పేరిట మార్చాలని' లాలాపేట్‌కు చెందిన స్థానికులు ఆంజనేయులు, శివరాములు కోరారు. మంగళవారం విద్యుత్ శాఖ ఏడీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యుత్ మీటర్లల పేరు మార్పిడి విషయమై ఎన్నో సార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అనేక సార్లు కింది స్థాయి సిబ్బందితోపాటు విద్యుత్ ఏఈకి కూడా విన్నవించుకున్నామన్నారు. ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్ మీటర్లతోపాటు బిల్లులోనూ పేర్లు మార్చాలని కోరారు.

మనస్తాపంతో ఇంటి నుంచి వెళ్లిన భార్య

● దంపతుల మధ్య గొడవే కారణం



అశ్విని (ఫైల్)

బౌద్ధనగర్ ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య చిన్నగొడవ జరుగగా మనస్తాపం చెందిన భార్య ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండాపోయింది. ఈ సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రాకేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా ఎల్లంపల్లికి చెందిన మీసాల ఈశ్వరమ్మ రెండో కుమార్తె ఎం.అశ్విని(20)కి, వెంకటేశ్‌తో 2019లో వివాహం జరిగింది. ఇద్దరూ నగరానికి వలసొచ్చి సీతాఫల్‌మండి ఇందిరానగర్‌కాలనీ రోడ్డునెంబర్-1లో నివాసం ఉంటున్నారు. ఈనెల 14న దంపతుల మధ్య గొడవ చోటు చేసుకుంది. అదేరోజు రాత్రి ఇంటి నుంచి భార్య వెళ్లిపోయింది. ఈ విషయాన్ని అల్లుడు తన అత్తయ్య ఈశ్వరమ్మ ఫోన్ చేసి తెలిపాడు. ఈమె నగరానికి చేరుకొని సోమవారం రాత్రి కుమార్తె కనిపించటం లేదని చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఊరికి వెళ్తున్నానని స్నేహితురాళ్లకు చెప్పి..



దివ్యభార్గవి

బోరబండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్ర రాష్ట్రం ఒంగోలు బొల్లినేనివారిపాలెంకు చెందిన దండు శ్రీనివాసరావు కుమార్తె దివ్య భార్గవి (23) ఎర్రగడ్డ శాంతినికేతన్ మహిళా కళాశాలలో ఎంకాం మెదటి సంవత్సరం చదువుతోంది. సమీపంలోని ఒక ప్రైవేటు హాస్టల్‌లో ఉంటుంది. సోమవారం సాయంత్రం బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో హాస్టల్ నిర్వాహకుడు జంగం చంద్రశేఖర్ దివ్యభార్గవి తండ్రి శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు ఇక్కడికి చేరుకుని ఆరా తీయగా ఊరికి వెళ్తున్నట్లు స్నేహితురాళ్లకు చెప్పినట్లు తెలిసింది. తండ్రి శ్రీనివాసరావు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.